నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, మంగళవారం 2 జనవరి 2024 | KARIMNAGAR

అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపాం

కరీంనగర్ క్యాంపు ఆఫీసులో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

- కేసీఆర్ పాలనలో ఎంతో ప్రగతి సాధించాం
- ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరిచ్చాం
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 1 : పద్నాలుగేళ్లు సుదీర్ఘ పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల కేసీఆర్ పాలనలో అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలిపామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యలో అసంపూర్తిగా నిలిపేసిన ప్రాజెక్టులను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేసిందని, ప్రతి ఎకరాకు గోదావరి జలాలను ఇచ్చినట్లు తెలిపారు. 2014 కంటే ముందు తెలంగాణలో 7 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఉండేవని, కానీ ఇప్పుడు 26 వేల మెగావాట్లకు పెంచామన్నారు. ఐటీ పరిశ్రమతోపాటు, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి చేశామన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని అంశాల్లో ముందంజలో నిలిపామని చెప్పారు. కొత్త ఏడాదిలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, స్వర్ణలత, రాజనర్సింగరావు, కొండయ్య, గజ్జెల దేవరాజు, మల్లెంకి శ్రీనివాస్, సాయికృష్ణ, గందె కల్పన, వైజయంతి పాల్గొన్నారు. అంతకు ముందు వినోద్‌కుమార్‌కు ఆయన నివాసంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రాజన్న సన్నిధిలో 'న్యూఇయర్' సందడి

వేములవాడ రాజన్న ఆలయ ముఖద్వారం ముందు భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 1: రాజన్న సన్నిధికి భక్తులు పోటెత్తారు. సోమవారం న్యూఇయర్ మొదటి రోజుకావడంతో సుమారు 50వేల మందికిపైగా తరలివచ్చారు. ఉదయం నుంచే పుణ్యస్నానాలు చేసి, దర్శనం కోసం బారులు తీరారు. ఆర్జిత సేవల ద్వారా సుమారు ₹20లక్షల ఆదాయం సమకూరిందని ఏఈవో బ్రహ్మన్న గారి శ్రీనివాస్ తెలిపారు. అలాగే జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండస్వామి కోడెమొక్కు చెల్లించుకొని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

దాహం తీర్చిన అర్బన్ భగీరథ

- కరీం'నగరం'లో తొలిగిన కష్టాలు
- కేసీఆర్ సర్కారు కృషితో పనులు
- ఇబ్బంది లేకుండా నిత్యం తాగునీరు
- రెండేండ్లుగా విజయవంతం
- నిరంతర సరఫరా దిశగా అడుగులు

ఒకప్పుడు కరీంనగర్ మంచినీటి సమస్యతో అల్లాడేది. పక్కనే మానేరు రిజర్వాయర్ ఉన్నా.. వేసవి వచ్చిందంటే చాలు తండ్లాడేది. కానీ, నాటి కేసీఆర్ సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథతో కరీం'నగర'ం దాహం తీరింది. అర్బన్ భగీరథ కింద వివిధ పనులు పూర్తి చేయడంతో రెండేండ్లుగా నగర ప్రజలకు ప్రతిరోజూ మంచినీరు సరఫరా అవుతున్నది. శివారు కాలనీలకు కూడా నీరు చేరుతున్నది.

బిందెలో నీటిని పడుతున్న మహిళ

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 1 : అర్బన్ మిషన్ భగీరథ కింద కరీంనగర్‌లో ₹125 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. లోయర్ మానేరు డ్యాం (ఎల్ఎండీ) వద్ద నుంచి రా వాటర్ సరఫరా చేశారు. అందుకు ఫిల్టర్ బెడ్స్, శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని గుట్టపై 3 ఎంఎల్‌డీ కెపాసిటీ ఉన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించారు. దీంతోపాటు రాంనగర్, హౌసింగ్‌బోర్డుకాలనీలో రెండు రిజర్వాయర్లను ఏర్పాటు చేశారు. ఎల్ఎండీ వద్ద ఫిల్టర్ బెడ్ నుంచి పద్మనగర్ బైపాస్ రోడ్డును ఆనుకొని శాతవాహన యూనివర్సిటీలోని గుట్ట వరకు నీటి పంపింగ్ కోసం నూతనంగా పైపులైన్లు వేశారు. అక్కడి నుంచి 1.4 కిలో మీటర్ల ఉన్న మల్కాపూర్ రోడ్డు రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాంనగర్ రిజర్వాయర్ అటు నుంచి కిలో మీటర్ దూరంలో ఉన్న కోర్టు చౌరస్తాలోని రిజర్వాయర్‌ను నింపేందుకు కొత్త పైపులైన్లు ఏర్పాటు చేశారు. నూతనంగా 36 ఎంఎల్‌డీ ఫిల్టర్ బెడ్ కూడా నిర్మించారు.

అర్బన్ భగీరథ కింద నగరంలో నిర్మించిన వాటర్ ట్యాంక్

దీంతో నగరంలో ఎక్కడా మంచినీటి సరఫరాకు ఇబ్బందులు తొలిగిపోగా, నిత్యం తాగునీరు అందిస్తున్నారు.

విలీన గ్రామాల్లోనూ పనులు

నగరపాలక సంస్థలో విలీనమైన ఎనిమిది గ్రామాలకు కూడా ప్రతి రోజు మంచి నీటి సరఫరాకు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. ఇప్పటికే ₹25 కోట్లతో పైపులైన్ వేస్తున్నది. వీటిల్లో ఇప్పటికే అత్యధిక శాతం పనులు పూర్తికాగా, మిగిలిన పనులను వచ్చే మూడు నెలల్లో పూర్తి చేయనున్నారు. వచ్చే వేసవి నాటికి ఈ విలీన గ్రామాల్లోనూ రోజూ మంచినీటి సరఫరా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

నిరంతర సరఫరాకు అడుగులు

నగరంలో పైలెట్ ప్రాజెక్టు కింద హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలో 24 గంటల మంచినీటి సరఫరాకు సంబంధించి పనులు పూర్తి కావస్తున్నాయి. ఇప్పటికే రిజర్వాయర్ నుంచి వివిధ ప్రాంతాలకు మంచినీటి సరఫరా అందించేందుకు హెచ్‌డీ పైపులైను వేశారు. ఆయా ప్రాంతాల్లో మీటర్లను కూడా ఏర్పాటు చేసి వాటి పనితీరును పరిశీలిస్తున్నారు. త్వరలోనే పనులన్నీ పూర్తి చేసి ఈ రిజర్వాయర్ పరిధిలో 24 గంటల మంచి నీటి సరఫరాకు ప్రయత్నిస్తున్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

శ్రీరాముడి అక్షింతలతో శోభాయాత్రగా వెళ్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల టౌన్, జనవరి 1 : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత దొరుకుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తెలిపారు. అయోధ్య శ్రీరాముడి వద్ద పూజలు అందుకున్న అక్షింతలు జిల్లా కేంద్రంలోని అష్టలక్ష్మీ ఆలయానికి చేరుకోగా ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అక్షింతలను శోభాయాత్రగా తీసుకెళ్లి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. శ్రీరాముని అక్షింతలను జిల్లా కేంద్రంలోని అన్ని వైష్ణవాలయాల నుంచి భక్తులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ గుగ్లిళ్లపు హరీశ్, బీఆర్ఎస్ నాయకులు ఆవారి గంగాధర్, గంప వేణు, చేని అనిల్, నిర్వాహకులు అశోక్‌రావు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేయూ మాజీ ఉపకులపతి డాక్టర్ వీ గోపాల్‌రెడ్డి

- రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి
- జీఎన్ఎన్ఎస్ అధ్యక్షుడు, కేయూ మాజీ ఉపకులపతి డాక్టర్ వీ గోపాల్‌రెడ్డి
- కేవీకేలో సేంద్రియ/ప్రకృతి సాగుపై అవగాహన సదస్సు

జమ్మికుంట, జనవరి1: మానవాళికి హానికరమయ్యే రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయం చేయాలని గ్రామీణ నవనిర్మాణ సమితి అధ్యక్షుడు, కేయూ మాజీ ఉపకులపతి డాక్టర్ వీ గోపాల్‌రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. సోమవారం జమ్మికుంట పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జీఎన్ఎన్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పరిపాటి జనార్దన్‌రెడ్డి జయంతి వేడుకలను కేవీకేలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సేంద్రియ/ప్రకృతి సాగుపై రైతులు, రైతు ఉత్పత్తిదారుల సభ్యులు, అగ్రి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు ఎరువుల వాడకాన్ని పెంచారని పేర్కొన్నారు. మోతాదుకు మించి వాడుతున్న క్రిమి సంహారక మందుల వల్ల నేల తన స్వభావాన్ని కోల్పోవడమే కాకుండా ఆహార ధాన్యాల వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. సేంద్రియ/ప్రకృతి సాగే మేలని సూచించారు. రైతులు సుస్థిర సాగు దిశగా అడుగులు వేయాలని కేయూ ప్రొఫెసర్ డాక్టర్ రామిరెడ్డి పేర్కొన్నారు. నేల, ఆరోగ్యం కాపాడడం అందరి బాధ్యతని జీఎన్ఎన్ఎస్ ప్రధాన కార్యదర్శి విజయ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. రైతు ఆర్థికాభివృద్ధి సాధిస్తేనే దేశం ముందుకు సాగుతుందని గ్రామ బజార్ కార్యదర్శి దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఎన్ఎన్ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్తూ..మృత్యు ఒడికి

- ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ దుర్మరణం
- పాలాస పాలస్తేశ్వరస్వామి గుడి కమాన్ వద్ద ప్రమాదం
- కొత్త సంవత్సరం నాడే విషాదం

సామ సుజాత (ఫైల్)

జగిత్యాల రూరల్, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని దైవ దర్శనానికి వెళ్తున్న మహిళను ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబలించింది. పాలాస పాలేస్తేశ్వర స్వామి ఆలయ సమీపంలో స్కూటీ, బస్సు ఢీకొన్న ప్రమాదంలో దుర్మరణం పాలైంది. జగిత్యాల రూరల్ పోలీసుల కథనం ప్రకారం..జగిత్యాలలోని మహాలక్ష్మినగర్‌కు చెందిన సామ సుజాత (42) కొత్త సంవత్సరం సందర్భంగా యేటా కుటుంబసమేతంగా ఏదో ఒక పుణ్యక్షేత్రానికి వెళ్తుండేది. కూతురు చిన్మయిరెడ్డి ఇటీవలే ఉన్నత చదువు కోసం కెనడాకు వెళ్లింది. భర్త మహేందర్‌కు పని ఉండడంతో సోమవారం ఉదయం ఒంటరిగానే స్కూటీపై హెల్మెట్ ధరించి పాలాస పాలస్తేశ్వరస్వామి ఆలయానికి బయల్దేరింది. ఆలయ కమాన్ వద్ద మూల మలుగుతుండగా ధర్మపురి నుంచి జగిత్యాల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు స్కూటీని ఢీకొన్నది. ఆమె బైక్‌పై నుంచి ఎగిరి కిందపడ్డది. హెల్మెట్ కూడా ఊడిపోయింది. దీంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన అక్కడకు చేరుకొని సుజాతను అంబులెన్స్‌లో జగిత్యాల జిల్లా దవఖానకు తరలించారు. కొద్దిసేపటి తర్వాత చికిత్స పొందుతూ మరణించింది. పోలీసుల సమాచారం మేరకు భర్త మహేందర్ జగిత్యాల దవాఖానకు చేరుకొని కన్నీరుమున్నీరయ్యాడు. మహేందర్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ పోలీసులు పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

జగిత్యాల : దేవిశ్రీ గార్డెన్స్‌లో తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి

- ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి
- సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల టౌన్, జనవరి 1 : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం స్థానిక దేవిశ్రీ గార్డెన్స్‌లో తపస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని పేర్కొన్నారు. తాను ఎల్లప్పుడూ ఉపాధ్యాయుల వెంట ఉన్నానని భవిష్యత్తులోనూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల కోసం పాటుపడతానన్నారు. అందరికీ ప్రభుత్వ విద్య నైతిక విలువలతో కూడిన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అంతకు ముందు ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల వెంట ఎల్లప్పుడూ ఉంటానని ప్రజల మనిషిగా ప్రజలతో మమేకమై పనిచేస్తానన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, సీపీఎస్ రద్దు ఆర్థికపరమైన అంశాలు, పీఆర్సీ, డీఏల మంజూరు కోసం తప్పక కృషి చేస్తానన్నారు. వీటితోపాటు మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుంటామని చెప్పారు. ప్రతి పాఠశాలకు స్కావెంజర్‌ను నియమిస్తామన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినపల్లి ప్రసాదరావు, డాక్టర్ తాటిపాముల సురేశ్‌కుమార్, రాష్ట్ర సహాధ్యక్షుడు ఐల్నేని నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి వీరమల్ల వెంకటరమణారావు, రాష్ట్ర బాధ్యులు లింబగిరి స్వామి, ఎలిగేటి రాజేంద్రప్రసాద్, గడ్డం మైపాల్ రెడ్డి, నీలిమ, జయ, భాగ్యలక్ష్మి, రఘునందన్, రాజేందర్, రజనీకాంత్, రమేశ్, జిల్లాలోని వివిధ మండలాల తపస్ జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు న్యూ ఇయర్ శుభాకాంక్షలు

మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ సోమవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం హైదాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయనను కలిసి మొక్కలు బహూకరించారు.

-గోదావరిఖని / గంభీరావుపేట, జనవరి 1

కేధార్‌కు ఈడీగా పదోన్నతి

జ్యోతినగర్, జనవరి 1 : రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) కేధార్ రంజన్‌పాండుకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు సోమవారం ఢిల్లీ ఎన్టీపీసీ కార్పొరేట్ సెంటర్ నుంచి పదోన్నతి ఆదేశాలు జారీ అయ్యాయి. ఆరు నెలల క్రితం బీహార్‌లోని మేజా ఉర్జా నిగమ్ ప్రైవేటు లిమిటెడ్ నుంచి బదిలీపై రామగుండం ఎన్టీపీసీకి వచ్చిన కేధార్ రంజన్‌పాండుకు అనతికాలంలోనే ఈడీగా ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్టుకు నూతన సంవత్సరం రోజున పదోన్నతి ఉత్తర్వులు రావడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ మహిళా రైతులు.. ప్రజాప్రతినిధులు

ఓదెల: పొలంలో నాటువేస్తున్న కొలనూర్ సర్పంచ్ మణెమ్మ

ఓదెల: పత్తి పంటలో రసాయనాలను పిచికారీ చేస్తున్న ఓదెల ఎంపీటీసీ లక్ష్మి

అప్పటిదాకా కష్టాలు, కన్నీళ్లలో బతికి కాస్త జీవితంలో కుదురుకోగానే కొందరు తమ జీవనవిధానాన్నే మార్చివేసుకుంటారు. 'జీవితంలో స్థిరపడ్డాం.. ఇక ఏమవుతుందిలే' అని భావిస్తుంటారు. తాము ఎక్కడి నుంచి వచ్చామనే మూలాలు మరిచిపోయి గొప్పలకు పోతుంటారు. అది రాజకీయనాయకులైనా.. ఉద్యోగులైనా.. ఇంకెవరైనా..? కానీ, ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండేవాళ్లను మాత్రం మనం కొంతమందినే చూస్తుంటాం. అందుకు ఓదెల మండలంలోని ఇద్దరు ప్రజాప్రతినిధులే నిదర్శనం. ఓదెల మండల కొలనూర్ సర్పంచ్ సామ మణెమ్మ, ఓదెల ఎంపీటీసీ బోడకుంట లక్ష్మి. ఓ వైపు గ్రామాభివృద్ధికి విశేషంగా కృషిచేస్తూనే, వ్యవసాయ పనులు చేస్తున్నారు. సర్పంచ్ మణెమ్మ గతంలో సొంత వ్యవసాయ పనులతోపాటు కూలీ పనులు చేశారు. గత ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలిచిన తర్వాత సైతం కూలీ పనిచేస్తున్నారు. ఎంపీటీసీ లక్ష్మి ఇప్పటికీ తమ వ్యవసాయ పొలం పనులు చూసుకుంటున్నారు. రెండు సార్లు వరుసగా ఎంపీటీసీగా గెలిచిన ఆమె, ఏ నాడూ వ్యవసాయాన్ని వీడలేదు. అటు గ్రామాభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్నారు.

- ఓదెల, జనవరి 1

చిన్నారుల్లో చిరునవ్వు కోసం..

- బాలకార్మికుల విముక్తికి ఆపరేషన్ స్మైల్-10
- జనవరి ఒకటి నుంచి 31 తేదీ వరకు స్పెషల్ డ్రైవ్
- రంగంలోకి ప్రత్యేక బృందాలు
- కార్ఖానాలు, దుకాణాల్లో తనిఖీలు
- తల్లిదండ్రులకు అప్పగించేందుకు చర్యలు

బడిలో ఉండాల్సిన బాలలు కార్ఖానాలు, దుకాణాల్లో బంధీలవుతున్నారు. పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన వయసులో బాలకార్మికులుగా మారుతున్నారు. చదువుకోవాలనే కోరిక ఉన్నా.. ఆర్థిక పరిస్థితులు సహకరించక బతుకుభారం మోస్తున్నారు. ఈ పరిస్థితులను గమనించిన నాటి కేసీఆర్ సర్కారు ఆపరేషన్ స్మైల్ అండ్ ఆపరేషన్ ముస్కాన్ తెచ్చింది. వేలాది మంది బాల కార్మికులకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి ప్రసాదిస్తున్నది. తాజాగా జనవరి ఒకటి నుంచి 31వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది.

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 1: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు నాడు కేసీఆర్ సర్కారు నడుంబిగించింది. 2015 జనవరిలో ఆపరేషన్ స్మైల్‌కు శ్రీకారం చుట్టింది. అలాగే అదే ఏడాది జూలైలో ఆపరేషన్ ముస్కాన్‌ను ప్రారంభించింది. వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు తొమ్మిది విడుతల్లో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో 3388 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించారు. తాజాగా జనవరి 1నుంచి 31వ తేదీ వరకు 'ఆపరేషన్ స్మైల్-10' పేరిట బాల కార్మికులను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించడం, పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక బృందాలతో తనిఖీలు

కార్మిక, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు, పోలీసు శాఖ నుంచి ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లు, తహసీల్దార్, ఇతర సిబ్బందితో కలిసి మండల స్థాయిలో బృందాలుగా ఏర్పాటు చేశారు. ఈ బృందాలు వ్యాపార సంస్థలు ప్రధానంగా బట్టల దుకాణాలు, హోటళ్లు, కార్ఖానాలు, ఇటుక బట్టీలు, బస్టాండ్లలో ఉదయం నుంచి రాత్రి వరకు తనిఖీలు చేపడతారు. ముందుగా బాల కార్మికులు పనిచేసే ప్రాంతాలు గుర్తిస్తారు. ఈ ప్రక్రియను ఈనెల 8వరకు చేపడతారు. ఈనెల 9నుంచి నెలాఖరువరకు రెస్క్యూ నిర్వహిస్తారు. బాధ్యులైన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, వారికి అప్పగిస్తారు. ప్రతి రోజు వారిని పాఠశాలలకు పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారు. అనాథలైన వారికి స్టేట్ హోం, చైల్డ్ హోమ్‌లలో ఆవాసం కల్పిస్తారు. సమీపంలో ఉండే విద్యా సంస్థల్లో వారిని చేర్పించి, విద్యాబోధన చేయించనున్నారు. పనుల్లో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేసి, వారిపై పెద్దమొత్తంలో జరిమానా కూడా విధిస్తారు. ఆమొత్తాన్ని పిల్లల పేరిట బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్న ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని ఈసారి కూడా పకడ్బందీగా నిర్వహిస్తాం. చిన్నారులను పనిలో పెట్టుకునే వాణిజ్య, వ్యాపార సంస్థలు, కార్ఖానాల్లో యాజమానులపై జేజేబీ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. రెస్క్యూలో పట్టుబడ్డ పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగిస్తాం.

- శాంత, ఐసీపీవో (కరీంనగర్)